ప్రజాశక్తి
శనివారం 22 జులై 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంతులేని 'స్మార్ట్' మోసం

◆ నిరుద్యోగులకు ఇవ్వని ఉద్యోగం ◆ తిరిగి చెల్లించని సొమ్ము
◆ ఒత్తిళ్లు భరించలేక మధ్యవర్తుల అవస్థలు ◆ తాజాగా కొమ్మాదిలో దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్మార్ట్ విలేజ్ క్లస్టర్ ఎగ్జిక్యూటివ్, క్లస్టర్ అసిస్టెంట్ ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షల రూపా యలు వసూలుచేసి ఇరికిపోయిన వారు తప్పించుకోలేక అవస్థలు పడుతున్నారు. బిజెపి నర్సీపట్నం పూర్వ ప్రధాన కార్యదర్శి, స్మార్ట్ విలేజ్ రీజనల్ మేనేజర్ ఇండిపూడి సుధాకర్ మోసాలకు నిరుద్యోగులు, అతన్ని నమ్మి డబ్బులు వసూలు చేసినవారు అనేక తిప్పలుపడుతున్నారు. రూర్బన్, స్టార్ విలేజ్ పథకం కింద నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన వారిలో పరువు, మర్యాదల్లేని కొంతమంది బహిరంగంగా తిరుగుతుండగా, ఇంకొంత మంది ముఖం చూపించుకోలేని పరిస్థితుల్లో దూరదూరంగా బతుకుతున్నారు. నిరుద్యోగుల నుంచి సుమారు 43 లక్షలు రూపాయలు వసూలుచేసి వారికి ఉద్యోగాలివ్వలేక, డబ్బులు వాపసు చేయకలేక, ఒత్తిళ్లను భరించలేక కొమ్మాది ప్రాంతంలోని దంపతులు ప్రసాద్, రాజరాజేశ్వరి ఈ నెల 19న ఆత్మహత్య చేసుకున్నారు. నిరుద్యోగుల నుంచి ఒత్తిడి పెరిగితే వీరి వలే ఎన్నో కుటుంబాలు వీధినపడే అవకాశంలేకపోలేదు. బెయిల్‌పై బయటకు వచ్చిన సుధాకర్ రహస్యంగా తన అనుచరులతో స్మార్ట్ విలేజ్ తరహా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అయినా ఈ కార్యకలాపాల నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవడంలేదు.

ఆత్మహత్య చేసుకున్న దంపతులు ప్రసాద్, రాజరాజేశ్వరి (ఫైల్ ఫొటో)

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పది వేల మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.400 కోట్ల వరకు సుధాకర్ వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంతపెద్ద మొత్తంలో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలుచేసిన, అందుకు సహకరించిన వ్యక్తుల నుంచి డబ్బులు రాబట్టి నిరుద్యోగులకు ఇప్పించే పని ఆది నుంచీ జరగడంలేదు. నర్సీపట్నం ప్రాంతంలో చాలా కాలం సుధాకర్‌ను పోలీసులు కాపాడారన్న విమర్శలు బలంగానే ఉన్నాయి. ఫిర్యాదులిచ్చిన నిరుద్యోగులను బెదిరించి పంపించేలా చేయడం, నచ్చజెప్పి పంపించడం వంటి పనులు పోలీసులు దగ్గరుండి చేయడంతో సుధాకర్, ఆయన అనుచరుల వసూళ్లకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని బాధితులు చెబుతున్నారు. మోసపోయిన అనేక ప్రాంతాల నిరుద్యోగులు వీధుల్లోకి రావడంతో నాడు సుధాకర్‌పై కేసు నమోదుచేయక తప్పనిసరి మిగతా 2లో..

ఆగస్టులో విశాఖకు రాహుల్

◆ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం
◆ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కార్మికులు సుదీర్ఘ కాలంగా చేపడుతున్న ఉద్యమానికి మద్దతుగా నిలిచేందుకు ఆగస్టులో కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ విశాఖ నగరానికి వస్తున్నారని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ స్టీల్‌ప్లాంట్ ప్రగతికి ఎలా సాయపడిందీ వివరించారు. విశాఖ నగరంలో అధికార పార్టీకి చెందిన ఒక ఎంపీ కుటుంబం కిడ్నాప్‌కు గురికావడం చూస్తే రాష్ట్రంలో పాలన ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. విశాఖ మిగతా 2లో..

మీడియాతో మాట్లాడుతున్న రుద్రరాజు

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 125 వినతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ఎంప్లాయి గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలున్నా విధుల నిర్వహణ పట్ల ఏ ఉద్యోగీ అలసత్వం చూపకూడదన్నారు. వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఎపిఎస్ ఆర్‌టిసి, హెల్త్, జివిఎంసి, రెవెన్యూ, మిగతా 2లో..

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే..

▶ వార్త 2లో..

డిఆర్‌ఎంగా సౌరవ్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

▶ వార్త మెయిన్‌లో..

28 నుంచి హింసపై మహిళల పోరు యాత్ర

▶ వార్త 5లో..

తూర్పు నావికాదళంలో విశాఖ కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరం తూర్పు నావికాదళ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తోందని తూర్పు నావికాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ బిశ్వజిత్ దాస్ గుప్తా అన్నారు. అయన ఉద్యోగ కాలం ఈ నెల 31తో ముగియనున్న సందర్భంగా శుక్రవారం ఉదయం తూర్పు నావికాదళ కార్యాలయంలో ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 38 నెలల కాలంలో తూర్పు నావికా దళంలో వినూత్న మార్పులు వచ్చాయని, అంతర్జాతీయంగా ఎంతో పురోగతి సాధించామని చెప్పారు. విశాఖపట్నంలో మొట్టమొదటి సారిగా 39 దేశాల భాగస్వామ్యంతో మిలన్-2023 వంటి గొప్ప కార్యక్రమం నిర్వహించామని, వచ్చే ఏడాది మిలన్-2024కు 60 దేశాలను ఆహ్వానించే స్థాయిలో భారతదేశం ఉందని తెలిపారు. నౌకల నిర్మాణంలో భారత్ ఉన్నత స్థాయికి ఎదిగిందన్నారు.

మాట్లాడుతున్న బిశ్వజిత్ దాస్ గుప్తా

'మణిపూర్' ఘటనపై నిరసనలు

మహిళలను వివస్త్రలను చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

మణిపూర్ అల్లర్లలో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడాన్ని ఖండిస్తూ విశాఖలో శుక్రవారం నిరసనలు పెల్లుబికాయి. దేశానికి తలవంపులు తెచ్చేలా ఉన్న ఈ ఘటనపై ప్రధాని నోరు విప్పాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆందోళనకారులు పెద్దపెట్టున నినదించారు. ఎంవిపి.కాలనీలో ఆదివాసీ విద్యార్థినులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పౌర ప్రజా సంఘాల వేదిక, మహిళా చేతన సంఘాల ఆధ్వర్యాన భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్. రాజు, కె.సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మిగతా 2లో..

ఎంవిపి.కాలనీలో విద్యార్థినుల కొవ్వొత్తుల ర్యాలీ

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రియాంక

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే..

రెండో రోజూ కొనసాగిన దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాల్సిందేనని నాయకులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన శుక్రవారమూ కొనసాగాయి. వీటికి సంఘం అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలోనూ, అసెంబ్లీలోనూ మున్సిపల్ కార్మికుల పర్మినెంట్‌పై ఇచ్చిన హామీని గుర్తు చేశారు. అయితే, వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్నా హామీ నెరవేరలేదన్నారు. కరోనాలో చనిపోయిన కార్మికులకు ఇంతవరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లిం చాలని, క్లాప్ డ్రైవర్లకు జాయింట్ లేబర్ కమిషనర్ మార్గనిర్దేశం ప్రకారం.. రూ.18,500 చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు కేటగిరీ వేతనాలు, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న జివిఎంసిలోని అన్ని సెక్షన్లలోని అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ పూర్తి రోజు పని బంద్ పెట్టి జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించాలని, ఆగస్టు 15 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్లాలని ఇప్పటికే నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు శీర రమణ, కార్యదర్శి జె.నాయుడు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు, ఇ.ఆదినారాయణ, ఎం.ఈశ్వరరావు, పి.అప్పలరాజు, మీనాక్షి, నాగరాజు, బి.రత్నం, వరలక్ష్మి, వెంకటరావు, అనిల్, శ్రావణ పాల్గొన్నారు.

దీక్షలకు మద్దతు తెలిపిన సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

మొదటి పేజీ తరువాయి..

అంతులేని 'స్మార్ట్' మోసం

పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలుచేసి సొమ్ముచేసుకున్న వారిలో కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులు, పోలీసులు వున్నట్లు విమర్శలున్నాయి. పలుకుబడి కలిగిన కొంతమంది ఈ వ్యవహారంలో భాగస్వాములు కావడంతో కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగుల నుంచి డబ్బుల వసూళ్ల వ్యవహారం సాగుతున్నప్పటికీ అడ్డుకట్ట వేయాల్సిన వారంతా మౌనందాల్చి లాభపడగా, ఉద్యోగం ఆశతో డబ్బులిచ్చిన నిరుద్యోగులు మోసపోయారు.

ఆగస్టులో విశాఖకు రాహుల్

భూ దందాలకు, సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారిందన్నారు. ల్యాండ్, శాండ్ మాఫియాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అమరావతి రాజధానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. షర్మిల కాంగ్రెస్‌లోకి వస్తే పార్టీ మరింత బలపడుతుందన్నారు. కాంగ్రెస్ భావిజాలం ఇష్టపడి పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామన్నారు. 2024లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావటం తథ్యమన్నారు.

నేడు స్టీల్ ప్లాంట్ మార్చ్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం గాజువాక జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ శిబిరం వరకు స్టీల్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అన్ని ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్, సుంకర పద్మశ్రీ, నగర పార్టీ అధ్యక్షులు గొంప గోవిందరాజు, సొడదాసు సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 125 వినతులు

జిల్లా విద్యాశాఖ తదితర శాఖలకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో వినతి పత్రాలు వచ్చాయి. మొత్తంగా ఈ గ్రీవెన్స్ డేకు 125 వినతులు అందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

'రెపో' 400'తో మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రెపో బ్యాంక్ డిపాజిట్ స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా శుక్రవారం వైజాగ్ శాంతి నగర్ బ్రాంచిలో నూతన పథకాన్ని ఆవిష్కరించింది. ఈ క్యాంపెయిన్ ఆగస్టు 31 వరకూ అందుబాటులో ఉంటుంది. దీని కింద ప్రవేశపెట్టిన రెపో 400లో భాగంగా సీనియర్ సిటిజన్స్‌కు 400 రోజులకు 8.25 శాతం, జనరల్ 7.75 శాతం వడ్డీ అందించనున్నట్లు చీఫ్ మేనేజర్ జె.రిషి తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న అధికారి

సంజీవయ్య ఉత్తమ సేవలకు గౌరవం

ప్రజాశక్తి-విశాఖపట్నం : గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని సీతమ్మధారకు చెందిన గృహ నిర్మాణ సంస్థ విశ్రాంత మేనేజర్ ఎన్.సంజీవయ్యకు ఉత్తమ పురస్కారం లభించింది. పనిచేసిన కాలంలో అందించిన సేవలకుగాను ఆయనకు అమరావతిలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జ్ఞాపికను అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా, కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను బేషరతుగా నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 841వ రోజుకు చేరాయి.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ కార్మికులకు పిఆర్‌సి ప్రకటించకుండా 15 మాసాలుగా చర్చల పేరుతో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం దారుణమని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యారావు అన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే విద్యుత్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న ఎపిఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ డిపార్ట్‌మెంట్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనూ పరిష్కారం చేయకపోయినా ప్రస్తుతం 1104 నాయకత్వంలో ఉన్న పవర్ జెఎసి ఏ విధమైన పోరాటమూ చేయకుండా యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆ జెఎసి నుంచి బయటకు వచ్చి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు), ఎపి ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి), ఎపి పవర్ ఎంప్లాయీస్ యూనియన్, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సంఘాలన్నీ ఏకమై ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీగా ఏర్పడ్డాయన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సులో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సయ్యద్ హుసేన్, బాలాజీ, అభిషేక్ పాల్గొన్నారు.

'మణిపూర్' ఘటనపై నిరసనలు

(మొదటి పేజీ తరువాయి..) పౌర ప్రజా సంఘాల వేదిక నాయకులు విమల, కత్తి పద్మ, హెచ్ఆర్ఎఫ్ ప్రతినిధి వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లు రోజురోజుకూ పెరుగుతుంటే స్పందించాల్సిన ప్రధాని మోడీ పెదవి మెదపకపోవడంపై మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నేడు ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గౌతమ్, శ్రావణ్, విమల, కుమారి, చంటి, భారతి, కొండమ్మ, విజయ, శాంతి, రమణి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

ఎంవిపి.కాలనీ : మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై అకృత్యాలను ఖండిస్తూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఆదివాసీ విద్యార్థినులు ఎంవిపి సర్కిల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంబిడి కోటేశ్వరరావు, గూడా సత్యారావు పాల్గొన్నారు.

మహా విశాఖనగర పాలక సంస్థ

రహదారి అభివృద్ధి ప్రణాళికపై పౌరుల అభ్యంతరాలు/సూచనలు

Rc.No.916/2023/ACP-III/Zone-III/G **Date : 21-07-2023**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, విశాఖపట్నం **NH-16** జంక్షన్ రోడ్ సత్యం జంక్షన్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం సీతమ్మధార మెయిన్‌రోడ్ ప్రతిపాదిత **100'-0** రహదారి అభివృద్ధిని చూపుతూ రోడ్డు అభివృద్ధి ప్రణాళికను నిబంధనలు **G.O.Ms.No.223 MA&UD** డిపార్టుమెంటు **Dt. 09-07-2018** మరియు **Sanctioned Master Plan G.O.Ms.No.136, MA&UD, Dt. 08-11-2021** అనుసరించి తయారు చేయడమైనది. ప్రతిపాదిత **100'** రోడ్ యొక్క సర్వేనెంబర్లు **8P, 9P, 10P, 12P, 13P, 14P, 39P, 40P, 41P, 42P, 44P, 46P, 47P, 48P, 49P, 50P,** యొక్క రేసపువానిపాలెం గ్రామము మరియు **S.No. 2P, 3P** యొక్క మద్దిలపాలెం గ్రామము కలదు. అందువల్ల ప్రజలు తమ అభ్యంతరాలు/సూచనలు ఏమైనా ఉంటే వాటిని సమర్పించడానికి ఇక్కడ సమాచారం అందించవలసినదిగా కోరడమైనది. దీనికి సంబంధించి, **100'-0" NH-16** జంక్షన్ రోడ్ సత్యం జంక్షన్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం సీతమ్మధార మెయిన్‌రోడ్ గల మాస్టర్ ప్లాన్ రహదారికి పై **RDP** ఆమోదానికి సంబంధించి **GVMC** ద్వారా ఈ నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుండి 07 రోజులలోపు అభ్యంతరాలు/ సూచనలు మొదలైనవి లేనట్లయితే రహదారి అభివృద్ధి ప్రణాళిక **(RDP)** యొక్క ఎగువ ఆమోదం నిబంధనలు ప్రకారం ప్రొసెస్ చేయబడుతుంది. **Sd/- COMMISSIONER, GVMC**

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS : 405/2016

Between:
Uppalapati Satyanarayana Raju --Plaintiff
And:
Uppalapati Seetharama Raju and others --Defendants

To
D-12: Pinnamaraju Rama Jansi W/o | Srinivasa Murthy Raju, Hindu, R/o Opp: Mandal Office, Rambilli Village, Rambilli |Mandalam, Visakhapatnam Dist.

ఇందలి పిటీషనర్ శ్రీ కోర్టు వారి వద్ద తనను భూమికి ఒనర్ డిక్లేర్ చేయమని కోరుతూ దాఖలు చేసిన దావాలో మీ యొక్క ఆక్షేపణలు దాఖలు చేయుటకు **తే.2-8-2023దిన ఉదయం 10-30 గం|| లకు** మీరు గాని మీ తరపు లాయరు ద్వారా గాని దాఖలు చేయవలెను. అట్లు కానిచో ఉన్న ఆదారాలతో మీ పరోక్షమున తీర్మానం చేయడమగునుని ఇందు ఎమూలంగా తెలియజేయడమైనది.

Uppalapati Satyanarayana Raju Plaintiff

KOMARA NIRANJANA RAO
ADVOCATE,
VIZIANAGARAM.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1554/2021

Between:
Hitesh Kumar Jain, Rep. by his GPA Holder Bhanwarlal Jain ...Plaintiff
And:
Asi Venkata Vara Narasimha Prasad Reddy ...Defendant

SUMMONS

To,
The Defendant:
Asi Venkata Vara Narasimha Prasad Reddy,
S/o. Late Asi Totayya Reddy, R/at Flat No.C-35, Lakshmi Nivas, D.No.38-39-66, 104 Area, Marripalem, Visakhapatnam-530018.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the matter stands posted to **13-09-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **13-09-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
RK LAW FIRM
T. RAVI KUMAR, Advocate
LIG-38, Ram Nagar Main Road, Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
A.S.185/2018

Between:
1) Smt. Gadiraju Vijaya Lakshmi
Sri Gadiraju Satyanarayana Raju (died)
2) Sri Gadiraju Venkata Subba Raju
3) Sri Gadiraju Haribapi Raju
...Defendants/Appellants
And:
1) Smt. Maddi Suramma
2) Sri Maddi Suryanarayana
3) Sri Maddi Gurumurthi
4) Sri Maddi Appala Konda
...Plaintiffs/Respondents

NOTICE

To,
R-1: Smt. Maddi Suramma,
W/o. Late Sanyasappadu, R/at Maddi Village, Padmanabham Mandal, Visakhapatnam District.
R-2: Sri Maddi Suryanarayana
S/o. Late Sanyasappadu, R/at Maddi Village, Employee in railways, Bilaspur 12w/2 A.E Colony, Railway institute, Bilaspur Districrt, Chattisgarh State.

Please take notice that the above named appellants filed an appeal against you and the Hon'ble Court ordered notice to you, the matter is posted to **11-08-2023** for your appearance at **10:30 A.M** in the above Court through Advocate or personally, failing which exparte orders will be passed against you.

(Order of the Hon'ble Court)
D.V.S.S.A.N. RAMALINGA RAJU
Advocate
Madhura Nagar, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: ANAKAPALLI
O.S. 108/2022

Between:
Gandraju Sreerama Chandra Raju ...Plaintiff
And:
Malleni Bhaskara Rao ...Defendant

SUMMONS

To,
The Defendant:
Malleni Bhaskara Rao,
S/o. Venkatayya, Hindu, aged about 60 years, Business, R/at D.No.50-62-4/8, Rajendra Nagar, Seethammapeta, Visakhapatnam-16.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for specific performance of contract directing you to execute a registered sale deed in his favour by receiving the balance sale consideration of Rs.20,000/- (Rupees: Twenty thousand only) in terms of the agreement dt.30-10-2009 and for other reliefs and the same stands posted to **24-08-2023** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte as per law.

(By Order of the Hon'ble Court)
B.K.NAIDU,
Advocate
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 980/2022

Between :
INDIAN BANK, Seethammapeta Branch, Visakhapatnam, Rep. by its Branch Manager ...Plaintiff
And:
Upadhyula Phani Kumar ...Defendant

SUMMONS

To, **The Defendant:**
UPADHYULA PHANI KUMAR,
R/at D.No.12-10-25, Vedulavari Street, Anakapalli-531 001 and also at C/o. B. Sreenu Babu, D.No. 22-73-26/4, Near Town Hall Road, Seetaramaswamy Temple Street, Visakhapatnam-530001.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **20-09-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **20-09-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
G. LAKSHMI RAMBABU,
S. VARALAKSHMI
Advocates,
Visakhapatnam

890వ రోజుకు ఉక్కు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో కార్మికుల రిలేదీక్షలు శుక్రవారం 890వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సెంటర్ ప్లాంట్ విభాగానికి చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ కూర్మనపాలెంలోని దీక్షల శిబిరం ఈనెల 31నాటికి 900 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 10.00 గంటల వరకు అగనంపూడి, వడ్లపూడి, గంట్యాడ, ఉక్కునగరం, కూర్మన్నపాలెం, గంగవరం నిర్వాసిత కాలనీలలో పాదయాత్ర చేయాలని నిర్ణయించామన్నారు. 31న సోమవారం సాయంత్రం 4.00 గంటలకు కూర్మన్నపాలెం శిబిరం వద్ద నిరసనల్లో కార్మిక కుటుంబాలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'ఉక్కు' పాదయాత్రను జయప్రదం చేయండి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం గాజువాక హిందుస్థాన్ జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వరకూ శనివారం జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. ఉక్కు నగరంలోని సిఐటియు కార్యాలయంలో యువ కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటూ మెరుగైన వేతనాలు సాధించుకుందా మన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన శనివారం ఉదయం 8 గంటలకు హిందుస్థాన్ జింక్ గేటు నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 24, 25, 26 తేదీలలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి.దాస్, నాయకులు బి.అప్పారావు, ఉరిటి మరిడయ్య, దాసరి శివ, పుల్లారావు, యు.అప్పలరాజు, ఎం.దానయ్య, కుమార్ రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 58వ వార్డు కార్పొరేటర్ గులివిందల లావణ్య ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్‌లో శ్రీహరిపురం ప్రాంతంలో దిగువున్న పలు ప్రాంతాలకు కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.50 లక్షలతో పాత పైపుల స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు పనులకు శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ శంకుస్థాపన చేశారు. రూ.24 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గులిగిందల కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, స్థానిక నాయకులు శ్రీనివాసరాజు, అంగా రాంప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, సత్య నారాయణ, రెడ్డి పిలక వెంకటరమణ, ఎదురి రాజు, రాం

సెయింట్ ఆన్స్ అధ్యాపకులకు అభినందన

ప్రజాశక్తి ములగాడ : రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూనిసెఫ్, బిసిడిఇ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అభ్యాసనాభివృద్ధి శిక్షణలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ అధ్యాపకులు ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై. అనసూయాదేవి, మురళిలను కాలేజ్ ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమకుమారితోపాటు పలువురు అభినందించారు. శిక్షణ కార్యక్రమంలో ప్రేరణామిత్ర యాప్, అభ్యసన వ్యూహాలు, యూనిసెఫ్ తయారు చేసిన కరదీపికలపై చర్చల్లో పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి వందమంది అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొనగా, పారిశ్రామిక ప్రాంతం నుంచి ముగ్గురు సెయింట్‌ఆన్స్ అధ్యాపకులు పాల్గొనడం విశేషం.

డివిఎంసి సభ్యునిగా రాజబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ(డివిఎంసి) సభ్యుడిగా అల్లంపల్లి రాజబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు ఉత్తర్వులు జారీ చేసారు. తన నియామకానికి సహకరించిన టిటిడి చైర్మన్, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాద్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు రాజబాబు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్నను దర్శించిన హీరో సాయిధరమ్ తేజ్

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను శుక్రవారం సాయంత్రం సినీ హీరో సాయిధరమ్ తేజ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ త్రినాథ్ ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు.కప్ప స్తంభం ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు అనంతరం ఆస్థాన మండపం వద్ద అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు స్వామి ప్రసాదాన్ని అందించారు.

వైభవంగా అప్పన్న గరుడసేవ

సింహాచలం: అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలో భాగంగా శుక్రవారం స్వామి కల్యాణాన్ని గరుడ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు.

హెల్త్ సెక్రటరీకి మదర్ థెరిసా అవార్డు

ప్రజాశక్తి-పెందుర్తి : 94వ వార్డు ముత్యం కాలనీ సచివాలయ హెల్త్ సెక్రటరీ ఎస్.దేముడమ్మ చేసిన సేవలకు గుర్తింపుగా మదర్ తెరెసా ట్రస్ట్ అవార్డును అందజేసింది. ఈనెల 20న ట్రస్ట్ ఎండి ఈ అవార్డును అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దేముడమ్మ మాట్లాడుతూ తనకు అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మరింత ఉత్సాహంగా సేవలు చేసేందుకు ప్రేరణనిచ్చిందన్నారు. ఈసందర్భంగా దేముడమ్మను పలువురు అభినందించారు.

డంపింగ్ యార్డు తరలించాలని వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయర్‌కు ఆనుకొని ఉన్న జివిఎంసి ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును అక్కడ నుంచి తరలించాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఎఐవైఎఫ్ నేతలు వినతిపత్రం అందజేసారు. అనంతరం అక్కడే ఉన్న జెడ్‌సి కనకమహాలక్ష్మికి కూడా విన్నవించారు. రిజర్వాయర్ సమీపంలో డంపింగ్ యార్డు ఉండడం వల్ల నీరు కలుషితమౌతోందని, ప్రజారోగ్యం దృష్ట్యా వెంటనే తరలించాలని కోరారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.అచ్యుతరావు, వై.రాంబాబు, సహాయ కార్యదర్శి కొమరం సందీప్, ఉపాధ్యక్షులు కెల్లా రమణ ఉన్నారు.

కనెక్టవిటీ రోడ్డు కోసం పరిశీలన

సీతమ్మధార : జివిఎంసి 25 వార్డు బిటిఆర్ కాలనీ, రెల్లివీధి బిటి.రోడ్డుకు బుల్లయ్య కాలేజీ రోడ్డుకు కనెక్టివిటీ రోడ్డు కోసం 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కలెక్టరేట్ సమావేశంలో ప్రస్తావించిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. శుక్రవారం డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వరరావు, టౌన్ ప్లానింగ్ ఎసిపి శాస్త్రి షబనన్, టిపిఎస్ అనిత పర్యటించి పరిశీలించారు. కార్యక్రమంలో డబ్ల్యుపిఎస్ హేమ, ఎఎన్ఎం రమణి, వార్డు యూత్ ప్రెసిడెంట్ సన్నీ వార్డు కన్వీనర్ బొమ్మాళి.రవి, గుడివాడ గౌరినాయుడు, ఆశా వర్కర్ సంధ్య పాల్గొన్నారు.

విశాఖ ఎంపిని బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి - సీతమ్మధార : పార్లమెంట్ సాక్షిగా సహచర ఎంపీ రఘురామకృష్ణంరాజుపై అసభ్య పదజాలంతో విరుచుకుపడి విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ విశాఖ పరువు తీశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దీనిపై ఎంపీ రఘురామకృష్ణంరాజు ఇప్పటికే లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. చట్టసభల్లో ఎంవివి ప్రవర్తనను తప్పుబడుతూ జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. లోక్‌సభ స్పీకర్ స్పందించి ఎంవివిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎంవివి భూకబ్జాలు, అక్రమప్రాజెక్టులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో బోధన

ప్రజాశక్తి -పద్మనాభం : విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంపిపి కె.రాంబాబు సూచించారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యార్థులు మంచి ప్రగతి కనబరిస్తే, హైస్కూల్ స్థాయిలో మంచి ఫలితాలు సాధించగలుగుతారన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. బదిలీ అయిన ఎంఇఒ శివరాణిని సత్కరించి, ఘన వీడ్కోలు పలికారు. కొత్త ఎంఇఒ-1పి.రమణను స్వాగతించారు. ఈ సందర్భంగా గంధవరం పాఠశాలకు చెందిన ప్రత్యేక అవసరాలున్న విద్యార్థి మహిదకు రూ.పది వేలు విలువైన కిట్‌ను ఎంపిపి అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 బాబూలాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి- ములగాడ : డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, తదితర సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి, నివారణకు ప్రజలంతా సహకరించాలని జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, ఐదవ జోన్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి కోరారు. శుక్రవారం 62వ వార్డు దుర్గానగర్‌లో డ్రైడే-ఫ్రైడేలో పాల్గొన్నారు. వ్యాధులకు కారణమైన దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందకుండా పరిసరాల్లోనూ, ఇళ్లల్లోనూ నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.. మలేరియా ఇన్‌స్పెక్టర్ డి రవికుమార్, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు రోమాల వేణుబాబు, డి రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, లు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మాధవధార నుంచి ఆర్అండ్‌బి జంక్షన్ వరకు రహదారి విస్తరణ, పునర్నిర్మాణ పనులను ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు, 51వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, డైరెక్టర్ పైడి శ్రీను, వైసిపి నేతలు పైడి ప్రతాప్, శ్యామ్, వినోద్, గణేష్, ధర్మేంద్ర, డిఇ భరణి, ఎఇ అర్చన పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానికంగా ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వృత్తి నైపుణ్యంతో పాటు ఆరోగ్యపరమైన చిట్కాలపై జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ అడ్వైజర్ జరజాపు సురేష్ శుక్రవారం అవగాహన కల్పించారు. జివిఎంసి పిఎస్ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, స్థానికులు ఎస్ జోగారావు పాల్గొన్నారు

ఫ్లోరోసిస్ నియంత్రణకు సమిష్టి కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార: జిల్లాలో ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణకు ప్రతిఒక్కరూ కలిసి పనిచేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యం, కుటుంబసంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. డిఎంహెచ్ఒ చైర్మన్‌గా, అసంక్రమిత వ్యాధుల జిల్లా ప్రోగ్రాం అధికారి సెక్రటరీగా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, డిఇఒ, ఆర్థోపెడిక్ వైద్యులు సభ్యులుగా ఉంటారన్నారు. విశాఖ జిల్లాలో అన్నిచోట్ల తాగునీటిని పరీక్షించి, విశ్లేషణ నివేదికల ఆధారంగా అవి తాగేందుకు ఉపయుక్తంగా ఉన్నాయో, లేవో నిర్ధారించి, ప్రజలకు తెలియజేస్తాలన్నారు. డాక్టర్ సునీత, పాల్గొన్నారు.

ప్రజల వద్దకు పరిపాలన 'సురక్ష' లక్ష్యం

సర్టిఫికెట్లను అందజేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పరిపాలనను ప్రజల ఇంటి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా నెలరోజుల పాటు జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు అన్నారు. శుక్రవారం 51వార్డు మాధవధార మాధవస్వామి కళ్యాణ మండపంలో జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొని సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో 1.6 కోట్లకుటుంబాలను, 5.30కోట్లమంది ప్రజలను నేరుగా కలవాలన్నదే ఈ బృహత్తర కార్యక్రమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రెయ్యి వెంకట్ రమణ, తహశీల్దార్ జయ, ఎపిడి పద్మావతి, డిఇ భరణి, ఎఇ అర్చన, జెసిఎస్ మండల కన్వీనర్ నీలి రవి, డైరెక్టర్స్ పైడి శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రిలో సర్పంచ్ చెల్లూరి పైడపుడు అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని240 మందికి వివిధ ధ్రువ పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పెదబాబు, ఎంపిపి, డి వాసురాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, ఎంపిటిసి చెల్లూరి నగేష్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, పార్టీ నాయకులుపొట్నూరు చంద్రశేఖర్, తుపాకుల అప్పలరాజు, ఎంపిడిఒ వెంకటరమణ, సచివాలయ కార్యదర్శి రఘుబాబు పాల్గొన్నారు

తాటితూరులో సర్పంచ్ సిరిగిడి సంతోషి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో 320 మంది అర్హులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపిపి డి.వాసురాజు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు బోని బంగారునాయుడు, ఎంపిటిసి ఉండభట్ల ఆదిలక్ష్మి, వైసిపి నేత ఈశ్వర్రావు పాల్గొన్నారు.

గాజువాక.: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు.జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక

దాకమర్రిలో ధ్రువ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

అధికారులు శ్రీనివాసరావు, ప్రవీణ, మండల ఇంచార్జి కులుకూరి మంగరాజు, సిఐ వెంకట రత్నం, వార్డు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లోకనాధం ,పెద్దింటి మంగునాయుడు, నాగిశెట్టి శ్రీనివాస్, ఇరోతి గణేష్ ,జుత్తు లక్ష్మీగొల్లపల్లి రాంబాబు, ఎల్వి రమణ, మంత్రి మంజుల,దేముడు,పెంటయ్య రెడ్డి,అప్పలరాజు,జన సతీశ్,అర్జున్,అడిగర్ల రమణ పాల్గొన్నారు.

ఆనందపురం : మామిడిలోవ, గండిగుండం గ్రామపంచాయతీలో జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎంపిడిఒ అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, ఇపిఆర్‌డి కరుణాకర్ రావు, ఎఒ సంధ్యారత్నప్రభ, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఉపాధ్యక్షులు కోరాడ ముసలినాయుడు, గండిగుండం సర్పంచ్ గండ్రెడ్డి శ్రీను, బలిరెడ్డి మహేష్, సర్పంచ్ మల్లికార్జునరావు, ఎంపిటిసి దోలా గౌతమి పాల్గొన్నారు.

త్యాగం చేసిన నిర్వాసితులకు తక్కువ వేతనాలా?

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు .. దీక్షా శిబిరాన్ని టిడిపి నేతల సందర్శన .. కార్మికులకు సంఘీభావం

గంగవరం పోర్టు కార్మికుల దీక్షా శిబిరంలో మాజీమంత్రి గంటా, మాజీ ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి- గాజువాక : త్యాగం చేసిన గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు ఆదానీ గంగవరం పోర్ట్ యాజమాన్యం తక్కువ వేతనాలు చెల్లిస్తోందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం నిర్వాసిత కార్మికులు 18రోజులుగా చేస్తున్న నిరవధిక దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. .

ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ, గంగవరం పోర్టు నిర్మాణం కోసం ఇళ్లు, భూములు, సర్వస్వం ధారపోసిన కార్మికులకు అత్యంత దారుణమైన వేతనాలను ఇస్తున్నారని, వారి త్యాగాలను గంగవరం పోర్టు యాజమాన్యం చులకన చేస్తోందన్నారు.వేతనాల పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని నిర్వాసిత కార్మికులు ఆందోళన చేస్తుంటే వారిని విధుల్లోంచి తొలగించడం యాజమాన్యం నిరంకుశవైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాధ్యత తీసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. నిర్వాసిత కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తెలుగుదేశం పార్టీ వారి పోరాటానికి అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కోవిరి అప్పలరాజు వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, గంటి పిల్లి లక్ష్మయ్య, కొవిరి అమ్మోరు పాల్గొన్నారు..

చర్చల్లో కొలిక్కిరాని సమస్య పరిష్కారం

విశాఖపట్నం సర్క్యూట్ హౌస్‌లో వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ ఇన్‌ఛార్జి వై.వి.సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సమక్షంలో గంగవరం పోర్టు యాజమాన్యం ప్రతినిధులు, కార్మికులు మధ్య సంప్రదింపులు జరిగాయి. తొలగించిన వారిని బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని, వేతన పెంపుపై స్పష్టత ఇవ్వాలని, రూ.పదివేలు నష్టపరిహారంతోపాటు దీక్షల రోజులకు వేతనాలు, వచ్చే ఏడాది ఇంక్రిమెంట్లుపై పోర్టు యాజమా న్యాన్ని వైవి సుబ్బారెడ్డి అడిగారు. దీనికి స్పందించిన యాజమాన్య ప్రతినిధులు తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. రూ.పది వేలు నష్టపరిహారం చెల్లింపునకు సుముఖత వ్యక్తం చేశారు. అయితే వేతనపెంపు, వచ్చే ఏడాది ఇంక్రిమెంట్లుపై దాటవేత ధోరణి అవలంభిస్తూ, అపుడు చూసుకుందామని, ముందుగా దీక్ష చేస్తున్న కార్మికులు విధుల్లో చేరాలని కోరారు. యాజమాన్యం వైఖరిపై కార్మికసంఘాల నేతలు, కార్మికులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు.

వేతన పెంపుపై స్పష్టత లేదు

నిర్వాసిత కార్మికుల డిమాండ్లలో ప్రధానమైన వేతనపెంపు, ఇంక్రిమెంట్లు చెల్లింపుపై యాజమాన్యం స్పష్టత ఇవ్వలేదని యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు అన్నారు. యాజమాన్యంతో చర్చలు అసమంజసంగా సాగాయని, ఏ విషయంలోనూ స్పష్టత ఇవ్వడం లేదన్నారు. అఖిలపక్ష పార్టీలు ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష కార్మిక సంఘాలను కలుపుకొని భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను ప్రకటిస్తామని వెల్లడించారు.

ఐటి హబ్‌గా విశాఖ

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి

జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో పాల్గొన్న సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార: రానున్న రోజుల్లో ఐటి హబ్‌గా విశాఖ మరింత పురోభివృద్ధి సాధిస్తుందని టిటిడి ఛైర్మన్, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్వర్ణభారతి స్టేడియంలో గ్రోవ్ స్నాప్ ఫాస్ట్, ఎడ్జిఫ్లెక్స్ నాలెడ్జ్ హంట్ అప్‌గ్రేడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో మాట్లాడుతూ ఐటిపరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఉద్యోగావకాశాలు అదేస్థాయిలో పెరుగుతున్నాయని, ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువత వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో 17 కంపెనీల సిఇఒలు పాల్గొంటున్నారన్నారు. అనంతరం ఆర్థికంగా వెనుక బడిన విద్యార్థులు, నిరుద్యోగులకు రూ.20 లక్షల స్కాలర్ షిప్‌లను సంస్థ ప్రతినిధులు బి.వేదవ్యాస్‌రెడ్డి, డి.గౌతంతోపాటు వైవి.సుబ్బారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎపిఇఐటిఎ జనరల్ సెక్రెటరీ వి.శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎంవి పవన్ కార్తీక్ వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, పీలా వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

వినతిపత్రం ఇస్తున్న క్షయవ్యాధి నివారణ విభాగం ఉద్యోగులు

ప్రజాశక్తి -విశాఖపట్నం : తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ జిల్లా క్షయవ్యాధి నివారణ విభాగం ఉద్యోగులు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి నివారణ విభాగం ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ ఎంవివి.గోపి, ప్రధాన కార్యదర్శి వి.వీరబ్రహ్మం మాట్లాడుతూ, 2003లో డిఎస్‌సి ద్వారా జిల్లా క్షయవ్యాధి నివారణ విభాగంలో ఉద్యోగులుగా నియమితులయ్యామని, తాము విధుల్లో చేరి 20 ఏళ్లు అవుతుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 27 మంది ఉన్నట్లు వివరించారు. 2014నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్న మాదిరిగా తమను పర్మినెంట్ చేయాలని కోరారు.

ఓటర్ల జాబితా ధ్రువీకరణ సర్వేలో వాలంటీర్ల సహకారం తీసుకుంటే చర్యలు

ప్రజాశక్తి-పద్మనాభం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సర్వే, సవరణ పారదర్శకంగా చేపట్టాలని తహశీల్దార్ తోట శ్రీవల్లి ఆదేశించారు. ఈ ప్రక్రియలో వాలంటీర్ల సహకారం తీసుకుంటే చర్యలు తప్పవని బిఎల్ఒలకు హెచ్చరించారు. శుక్రవారం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై బిఎల్ఒలు, వివిధ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల ధ్రువీకరణలో బిఎల్ఒలు ఎటువంటి లోపాలకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణపై కచ్చితంగా వ్యవహరించాలని, దీనికి ఆయా బూత్‌స్థాయిలో రాజకీయనేతలు సహకరించాలని కోరారు. మండలంలో 45పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఐదుగురు సూపర్‌వైజర్లు, 45మంది బిఎల్ఒలను నియమించామన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కె రమణ, కె లీలావతి, కె దామోదరరావు, బిజెపి నేత ఆర్ శ్రీను, పి అప్పలరమణ, వైసిపినేత ఎం.శివరామకృష్ణ, టి.పద్దు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు / ఆధునిక నైపుణ్యాలను పెంచుకోవాలి

గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగం సమావేశంలో సేల్స్‌ఫోర్ డాట్‌కామ్ డైరెక్టర్ శ్యామ్

శ్యామ్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి - మధురవాడ : ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారు నూతన ఆధునిక అంశాలపై నైపుణ్యాలను పెంచుకోవాలని అమెరికాలోని లాస్‌ఎంజల్స్ కేంద్రంగా గల సేల్స్‌ఫోరు డాట్.కామ్ సంస్థ సాంకేతిక విభాగం డైరక్టర్ కె.శ్యామ్ సూచించారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐఇఇఇ) విద్యార్థి విభాగం సమావేశంలో మాట్లాడుతూ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, కోడింగ్, కృత్రిమ మేధ వంటివి నూతన అవకాశాలను విద్యార్థులకు అందిస్తున్నాయన్నారు. సామాజిక మాధ్యమాలను వినియోగించే సమయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా ఆన్‌లైన్‌లో ఉన్నత వ్యక్తిత్వంతో వ్యవహరించాలని, అనైతిక పోస్టింగ్‌లు జోలిక వెళ్లవద్దని సూచించారు. సేల్స్‌ఫోర్స్ డాట్ కామ్ ద్వారా నైపుణ్యాలను పెంచుకోవడం, నెట్‌వర్కింగ్, ఉద్యోగఅవకాశాలను పొందడం ఎలాగో వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష, ఐఇఇఇ విద్యార్థి విభాగం సలహాదారు ప్రణీల్ అంకిరెడ్డి పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రణాళిక

పార్కులను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి -మధురవాడ : నగరవాసులు సేదదీరేందుకు పార్కుల అవసరం ఎంతో ఉందని, జివిఎంసి పరిధిలోని పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ అన్నారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జివిఎంసి2, 3 జోనల్ పరిధిలోని ఎండాడ, సాగర్‌నగర్, ఎంవిపి కాలనీ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని పార్కులలో వృద్ధులు, పిల్లలు, విభిన్న ప్రతిభావంతులతోపాటు అన్ని వయస్సుల ప్రజలకు ఉపయోగపడేలాప్లే గ్రౌండ్స్, జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎండాడ వైఎల్‌పి లేఅవుట్ ప్రాంతంలో పామ్ థీమ్ పార్కును రూ.1.50కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ఎంవిపి కాలనీ ఎఎస్ రాజా స్టేడియం ఎదురుగా పార్కును రూ.కోటితో అభివృద్ధి చేస్తామన్నారు. ఎంవిపిలోని సెక్టార్-6 వద్దనున్న ఏనుగుల పార్క్ నిర్వహణ, పారిశుధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేసి తక్షణం బాగుచేయాలని ఆదేశించారు. సాగర్‌నగర్ తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేయించాలని ఎఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.కిషోర్‌ను ఆదేశించారు. ఎస్ఇలు సత్యనారాయణ రాజు, శ్యాంసన్ రాజు, ఇఇలు శ్రీనివాస్, ప్రసాద్, డిఇ వంశీ పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-లీగల్ రిపోర్టర్ : వివేకానంద అడ్వకేట్ అసోసియేషన్ మెంబర్స్ ఆధ్వర్యంలో నక్కవానిపాలెం జివిఎంసి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వివేకానంద బోధనలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద జీవిత విశేషాలు, ఆయన ఆశయాలపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ సెక్రెటరీ స్వామి స్వాసం వేద్యానంద పాల్గొని వివేకానందుని జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వివేకానంద అడ్వకేట్ అసోసియేషన్ సభ్యులు పైడి గోవిందరావు, విద్యాశంకర్ కండెల్వాల, హరిహరరెడ్డి, పొన్నాడ రాజారావు,హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దంత వైద్యంలో విప్లవాత్మక మార్పులు

గీతం' జాతీయ సదస్సులో ఐఒఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బల్వీందర్‌సింగ్

సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ బల్వీందర్‌సింగ్

ప్రజాశక్తి - మధురవాడ : దంతవైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తున్నాయని ముఖ్యంగా త్రిడి ప్రింటింగ్, కంప్యూటర్ సైన్స్‌లతో పాటు ఇన్‌విజిబుల్ ఆర్థోడాంటిక్స్ వంటివి అందుబాటులోకి రావడం ప్రజలకు మెరుగైన చికిత్స అందించడానికి దోహదపడుతోందని ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటి (ఐఒఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బల్వీందర్‌సింగ్ టక్కర్ అన్నారు. శుక్రవారం గీతం దంతవైద్య కళాశాల ఆస్పత్రి, ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌విజిబుల్ ఆర్థోడాంటిక్స్ జాతీయస్థాయి సదస్సును ప్రారంభించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ, ఇతర రంగాల మాదిరి భారతీయ దంత వైద్యులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఐఒఎస్ ద్వారా దేశంలోని పిజి దంత వైద్య విద్యార్థులకు పరిశోధన నిధులను అందించడం, నూతన నైపుణ్యాలపై అవగాహన కలిగించడం, స్టూడెంట్ ఎక్సేంజ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025లో విశాఖలో మరో జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు.

ఐఒఎస్ కార్యదర్శి డాక్టర్ సంజయ్ లాబ్ మాట్లాడుతూ దంత వైద్యంలో ఉన్నత ప్రమాణాలను, నూతన చికిత్స విధానాలను నెలకొల్పాల్సిన బాధ్యత వైద్యులదేనన్నారు. గీతం దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సీతారామరాజు మాట్లాడుతూ దశాబ్దాల కిందటి దంత వైద్య విధానాలలో, బోధన పద్ధతులలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. గీతం దంత వైద్య కళాశాలను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో మార్చామని,పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఒఎస్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ చలసాని శ్రీకృష్ణ, గీతం దంత వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ఎన్.శశిధర్, ఆర్థోడాంటిక్స్ అధిపతి డాక్టర్ ఎన్.సతీష్‌వర్మ, సదస్సు సైంటిఫిక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ పి.ఉజ్వల, డాక్టర్ సూర్యకాంత్ దాస్, కోశాధికారి డాక్టర్ బి.సోమ్‌సుధీర్ పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్థోడాంటిక్స్ వైద్యులు, పరిశోధకులు హాజరయ్యారు.

28 నుంచి హింసపై మహిళల పోరు యాత్ర

జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి- అనకాపల్లి

మహిళలపై జరిగే హింసను అరికట్టాలని రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28 నుండి ఆగస్టు 8వ తేదీ వరకు మహిళల పోరు యాత్ర జాతా నిర్వహిస్తున్నట్లు అఖిలభారతం ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి తెలిపారు. స్థానిక దొడ్డి రామనాయుడు భవనంలో శుక్రవారం ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఐద్వా నిర్వహించే పోరు యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ జాత అనకాపల్లి జిల్లాలో 31వ తేదీన ఉంటుందని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారులపై అత్యాచారాలు 25శాతం పెరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్లో చిన్న పిల్లల అక్రమ రవాణా కూడా ఇటీవల పెరిగిందని తెలిపారు. సినిమాల్లో, ప్రసార మాధ్యమాల్లో స్త్రీలను కేవలం సెక్స్ సింబల్గా చూపించే చర్యలను రూపుమాపాలని, పోర్న్ మూవీలు నిషేధించాలని, స్త్రీలపై ఇంటా బయట జరిగే హింసాత్మక చర్యలను నిర్మూలించడానికి ప్రభుత్వం ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ పోర్టు ద్వారా విచారణ జరిపించాలని, మూడు నెలల్లో దోషులను శిక్షించాలని, జస్టిస్ వర్మ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, పని ప్రదేశాలలో లైంగిక వేధింపులను నిర్మూలించే కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో మహిళలపై జరిగే నేరాలుపై వారి అభిప్రాయాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పి.పరమేశ్వరి మాట్లాడుతూ మహిళలని ఓటు బ్యాంకుగా చూపిస్తున్నారని, వాళ్లపై దాడి జరిగితే పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రముఖ న్యాయవాది, సంఘ సంస్కర్త కేతా కుసుమ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ బలహీనంగా ఉందని, ఎఫ్ఐఆర్ బుక్ రాయడానికి చాలా పోరాటాలు చేయాల్సి వస్తుందని తెలిపారు. లాయర్ గంగాధర్ మాట్లాడుతూ వ్యవస్థలో సమూలమైన మార్పులు రావాలన్నారు. మరో లాయర్ సురేష్ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడంలో మనం వెనుకబడ్డామన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఎ.బాలకృష్ణ (కౌలు రైతు సంఘం) జి.నాయిని బాబు(రైతు సంఘం) ఉమామహేశ్వరరావు (జెవివి), ఆర్.శంకర్రావు, దాకారపు శ్రీనివాసరావు (సిఐటియు), జి.శ్రీరామ్ (జిఎంపిఎస్) గాడిబాలు (రైతు సంఘం), బి.నూకప్పారావు (ఎన్పిఆర్డి), డిడి.వరలక్ష్మి, దేవి, సూర్యప్రభ, సుభాషిణి, వాణి, శారద (ఐద్వా) పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల నేతలు, లాయర్లు

వినతులు స్వీకరిస్తున్న ఫోరం చైర్మన్ సత్యనారాయణ తదితరులు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం

విద్యుత్తు వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం పనిచేస్తుందని ఫోరం చైర్మన్ జిల్లా రిటైర్డ్ జడ్జి బి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం చోడవరం విద్యుత్శాఖ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం ప్రాంతంలో వోల్టేజీ సమస్య ఉన్నట్లు ఫిర్యాదులు అందాయని, దీని పరిష్కారం కోసం ఏం చేయాలన్నది సంస్థకు సూచిస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కారం కోసం అధికారులకు అర్జీలు పెట్టుకున్నప్పుడు పరిష్కారం కాకపోతే 1912 టోల్ ఫ్రీ నెంబర్కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యుత్ వలన ప్రమాదం సంభవించి మనుషులు, జంతువులకు మరణం, లేక క్షతగాత్రులు అయినప్పుడు సహాయాన్ని పొందవచ్చని, అటువంటి సహాయం విద్యుత్ అధికారులు వద్ద లభించకపోతే తమకు ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. సిబ్బంది కొరత వల్ల నిరంతరం విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని కొంతమంది ఫిర్యాదు చేశారన్నారు. గాంధీ గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు, జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు సమస్యలపై వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఆర్ సురేంద్ర కుమార్, హరిబాబు, చోడవరం ఏడి పరిధిలో ఉన్న విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల వెరిఫికేషన్ నిష్పక్షపాతంగా జరపాలి

ప్రజాశక్తి -అనకాపల్లి, కశింకోట : బూత్ లెవెల్ అధికారులు ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిష్పక్షపాతంగా జరపాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. అనకాపల్లి మండలం కొత్తూరు నరసింగరావు పేట, కశింకోట మండలం కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ శ్రేణులు ఓటరు వెరిఫికేషన్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలందరూ తమ ఓట్లను నమోదు, పరిశీలన చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణమూర్తి, మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య, ఎమ్పిటిసి బుదిరెడ్డి అప్పుడు పాల్గొన్నారు. చింతలపాలెంలో ఓటర్ రీవెరిఫికేషన్లో టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ కర్రి దుర్గనాయుడు, జెర్రిపోతల నూకి నాయుడు, ఆనాల తాతియ్య నాయుడు, కొన రమణ పాల్గొన్నారు.

ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

జిల్లాలో 270 మందికి నేతన్న నేస్తం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 270 మంది చేనేత లబ్ధిదారులకు రూ.24 వేలు చొప్పున రూ. 64 లక్షల 84 వేలు వారి వారి ఖాతాలకు జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించిన నేతన్న నేస్తం జిల్లా స్థాయి కార్యక్రమంలో చేనేత కార్మికులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జెసి జాహ్నవి మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలోని లబ్ధిదారులకు రూ.3 కోట్ల 42 లక్షల 72 వేలు అందించినట్లు చెప్పారు. జిల్లాలో గత ఏడాది 20 చేనేత సహకార సంఘాలు ద్వారా రూ.6.50 కోట్ల విలువ గల వివిధ రకాలు చేనేత ఉత్పత్తు లను విక్రయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, జెడ్పి వైస్ చైర్పర్సన్ బి.వరాహ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్, హ్యాండ్లూమ్స్ టెక్ స్టైల్స్ శాఖ అభివృద్ధి అధికారి బి.సునీల్ కుమార్, నక్కపల్లి, పాయకరావుపేట సొసైటీ అధ్యక్షులు జి.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, శంకరం సర్పంచ్ పి.లక్ష్మి రామకృష్ణ పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న జెసి జాహ్నవి, జెడ్పి వైస్ చైర్పర్సన్ సత్యవతి

21 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

అక్రమంగా తరలిస్తున్న 20 కేజీల గంజాయిని బుచ్చయ్యపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కుమారస్వామి కథనం ప్రకారం.... మండలంలోని వడ్డాది ఎస్టీఎస్ స్కూల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పాడేరు నుండి పాసింజర్స్తో ఒక జీపు రాగా దానిని ఆపి తనిఖీ చేశారు. కర్రల బ్యాగులలో మీదన బట్టలు ఉండి కిందన గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. గంజాయి తీసుకెళ్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలానికి చెందిన తామర బెంజిమెన్, కొర్రా అశ్విని, పాంగి శాంతి, కొర్రా ఏమ్మిమ అరెస్టు చేశారు. అదే మండలానికి చెందిన కొర్రా రాజారావు అనే వ్యక్తి ఒరిస్సాలో గంజాయి కొనుగోలు చేసి అక్రమ తరలింపులో సూత్రధారిగా వ్యవహరించాడని తెలిపారు. సదరు వ్యక్తిని కూడా అదుపులో తీసుకొని కోర్టులో హాజరు పరచగా మొత్తం ఐదుగురికి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును కొత్తకోట సిఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మణిపూర్ ఘటన హేయం

దోషులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా నేత ప్రభావతి

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అనకాపల్లి

మణిపూరిలో ముగ్గురు మహిళలను వివస్త్రను చేసి, ఊరేగించి, అత్యాచారం చేసి, ఇద్దరు మహిళలు చంపేసిన దారుణ సంఘటనపై శుక్రవారం అనకాపల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ మణిపూరిలో గత ఆరు నెలలుగా మారణహోమం జరుగుతున్నా దానిని అరికట్టడంలో బిజెపి డబల్ ఇంజన్ సర్కారు వైఫల్యం చెందిందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతనే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ స్పందించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఈ ఘటన రెండు తెగల మధ్య అని చిత్రీకరించడం కోసం ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమాలు చేస్తున్నప్పుడు ఆ ఉద్యమాల్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం బలగాలని పంపిస్తున్నారని ఆరోపించారు. మణిపూర్లో జరుగుతున్న నేరాలు అరికట్టడానికి బలగాలని పంపించలేదని, ఇది మోడీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. మణిపూరి మారణకాండను నియంత్రించడానికి ఒక సిట్టింగ్ సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు డిడి వరలక్ష్మి, జి సుభాషిణి, రైతు సంఘం నాయకులు జి.నాయినబాబు, కౌలు రైతు సంఘం నాయకులు ఎ.బాలకృష్ణ, సిఐటియు నాయకులు జి.కోటేశ్వరావు, డి.శ్రీనివాస్, గంటా శ్రీరామ్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి అవమానకరం

ప్రజాశక్తి - దేవరాపల్లి :మణిపూర్ ఘటన దేశానికి అవమానకరమని అనకాపల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు, కెవి.రమణ అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ అక్కడ ఇద్దరు ఆదివాసీ మహిళలను బహిరంగంగా వివస్త్రను చేసి నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం అమానుషమని పేర్కొన్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా జరిగిన ఈ అమానవీయ ఘటనపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రధాని మోడీ స్పందన ఈ దేశానికి సిగ్గుచేటని పేర్కొన్నారు. ఇటువంటి దాష్టీకం దేశంలో ఎక్కడా పునరావృతం కాకుండా ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై అనేక సంఘటనలు జరిగినా ఎందుకు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ప్రశ్నించారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను పటిష్టపరిచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తక్షణమే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : జివిఎంసి 79వ వార్డు లంకెల పాలెం రామాలయం కూడలిలో స్వచ్ఛ సర్వేక్షన్లో భాగంగా తడి మరియు పొడి చెత్త వేరు చేయడం, డెంగీ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మాట్లాడుతూ లంకెలపాలెం పూర్తిగా ఫార్మా పొల్యూషన్తో నిండుకుందని వెంటనే జంక్షన్లో పొల్యూషన్ మానిటరింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్వీపింగ్ మిషన్తో వారానికి రెండుసార్లు జంక్షన్లో క్లీనింగ్ చేయించాలని, అగనంపూడి ప్రశాంతినగర్ సచివాలయంలో సానిటరీ సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంహెచ్ఓ కిరణ్, సచివాలయ సిబ్బంది, శానిటరీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరిష్కరించకుంటే దశలవారీ ఆందోళన

రెండో రోజు కొనసాగిన విఆర్‌ఎల నిరసనలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

విఆర్‌ఎల సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే దశల వారీ ఆందోళన చేపడతామని సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన శిబిరాన్ని శ్రీనివాసరావు సందర్శించి మాట్లాడారు. వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పే స్కేలు అమలు చేయాలని అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. విఆర్‌ఎల ఆందోళనకు కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు ఆళ్ల మహేశ్వరరావు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల లంబ సన్యాసిరావు, ఎన్.ఈశ్వరరావు, చిన్నా, శంకర్, రాజు, మహేష్, పద్మా ఆదిలక్ష్మి, కాంతం, చంద్రకళ పాల్గొన్నారు.

అనకాపల్లి : తహశీల్దారు కార్యాలయం వద్ద వీఆర్‌ఏల రెండో ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు మండలం ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ నామినీలుగా పనిచేస్తున్న వారందరిని విఆర్‌ఏ లుగా నియమించాలన్నారు. ఐద్వా నాయకులు డిడి వరలక్ష్మి ఆందోళనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బుగిడి నూక అప్పారావు, తోటాడ సింహాచలం, కొత్తపల్లి నాగేశ్వరరావు, జి. సోమయ్య, ఎస్.కె.ఆర్ బాషా, జి.సూర్యారావు, జి.రాధిక, ఎస్. పద్మ, కట్టా నాయుడు, కె.మోదమ్మ పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెండవ రోజు ధర్నా కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు చింతా అప్పారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విఆర్‌ఎల చేత గొడ్డుచాకిరీ చేయించుకుంటూ పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. విఆర్‌ఏ

దేవరాపల్లిలో...

అచ్యుతాపురంలో నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

ఆందోళన శిబిరాన్ని టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి కుమార్ సందర్శించి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఐ.ఈశ్వరరావు మల్లేటి బుజ్జులు, కన్నా బత్తుల ఈశ్వరరావు, పాపమ్మ, దేవుడమ్మ,రాజులమ్మ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో విఆర్‌ఎల రెండో రోజు నిరసన కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఎన్.గంగాధరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.సంతోష్, ఆరిపాక నర్సింగరావు, బాతు శంకర్ పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం తహశీల్దార్ కార్యాలయం రెండవ రోజు రిలే నిరాహార దీక్షకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వరలక్ష్మి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రెవెన్యూ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు రెండో రోజు ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా కోశాధికారి ఎం సంతోష్ కుమార్, ఆర్ శంకర్, వై బాబురావు, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గ్రామ సేవకుల అడుగుతున్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో రెండు రోజు ఆందోళన శిబిరాన్ని వారు సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, బయలుపూడి రామదాసు, విఆర్‌ఏ సంఘం నాయకులు గాలి పరదేసి నాయుడు, కార్యదర్శి శివలంక కృష్ణ, రవికుమార్, మంత్రి అప్పారావు, ఎ.నూకరాజు, ఎస్.అప్పలమ్మ, ఎలమంచిలి నాగమణి, జి గీత, కెవి రమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాడుగుల: ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు డిమాండ్ చేశారు. రెవెన్యూ కార్యాలయం ఎదురుగా వీఆర్‌ఏలు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం ప్రకటించారు.

చీడికాడ: తహసిల్దార్ కార్యాలయం వద్ద రెండో రోజు వీఆర్‌ఏల దీక్ష కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, శివ తాతబాబు, ఈశ్వరరావు, వెంకటలక్ష్మి, రమణ, కన్నయ్య రాజు, పైడితల్లమ్మ, నాగమణి, వెంకటరమణ, సింహాచలం, రవణమ్మ ఎరుకులమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: తహసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో పెదపూడి నూకన్న, ఈశ్వర్ ప్రసాద్, సోములమ్మ, లవ కుశలు, రాజువేణి తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: తహశీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్‌ఎల రెండో రోజు ధర్నా కొనసాగింది. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల జిల్లా యూనియన్ అధ్యక్షులు ఎ.రవికుమార్, మండల యూనియన్ అధ్యక్షులు గుడాల శివ, కార్యదర్శి ఆర్ల మరిడయ్య పాల్గొన్నారు.

కోటవురట్ల: తహసిల్దార్ కార్యాలయం వద్ద రెండవ రోజు వీఆర్‌ఏలు నిరసన చేపట్టారు.. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు,

పద్మనాభం : తమ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు చేస్తున్న విఆర్‌ఎలు, శుక్రవారం రెండోరోజు ధర్నా చేశారు. విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు తమ డిమాండ్లపై తహశీల్దార్ తోట శ్రీవల్లికి వినతిపత్రం అందజేశారు.

మునగపాకలో...

ఏటవతల గ్రామాలు ధర్మశ్రీకి రుణపడి ఉంటాయి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని ఏటవతల గ్రామాలుగా పిలువబడే జన్నవరం, బెన్నవోలు, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మన్న పాలెం గ్రామాల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి రుణపడి ఉంటారని డిసిసిబి డైరెక్టర్ మూడేడ్ల మహాలక్ష్మి శంకర్ అన్నారు. శుక్రవారం ఉదయం జన్నవరం పిఎసిఎస్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పట్టించుకోకపోవడం వల్ల తమ ప్రాంతం వెనుకబడి పోయిందని, అయితే ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలకు 10 ఎకరాలు స్థలం కేటాయించడంతో పాటు, రూ.35 కోట్లు నిధులు మంజూ చేయించాలని తెలిపారు. చోడవరం-కన్నంపాలెం రహదారి మరమ్మతులకు రూ.2.8కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బైన ఈశ్వరరావు, సర్పంచులు కోసం సన్యాసిరావు, పోతల ప్రసాద్, గొర్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు గంటా కృష్ణ, సాలాపు శ్రీనివాసరావు, కోన గోవింద పాల్గొన్నారు.

అనకాపల్లిలో జలవనరుల శాఖ కార్యాలయం పెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జలవనరుల శాఖ విశాఖపట్నం డివిజన్ కార్యాలయం అనకాపల్లిలో పెట్టాలని అనకాపల్లి వ్యవసాయ దార్ల సంఘం ప్రతినిధులు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు తెలిపారు. స్థానిక వివి రమణ రైతు భారతిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా లోవున్న అనకాపల్లి, మునగపాక, అచ్యుతాపురం, కశింకోట, పరవాడ మండలాల్లో నీటిపారుదల వ్యవస్థ వుందని, శారదానది పరివాహకప్రాంతంలో సుమారు 50వేల ఎకరముల ఆయకట్టు వుందని పేర్కొన్నారు. సమస్య వచ్చినా రివ్యూ చెయ్యడానికి జిల్లా హెడ్ క్వార్టర్ అనకాపల్లి సెంటర్ పాయింటుగా ఉంటుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ గుర్తించకపోవడం విచారకరమన్నారు. జిల్లా కార్యాలయం అనకాపల్లిలో ఉంటే ఆయకట్టు దారులకు, అధికారులు అందుబాటులో ఉంటుందని, కలెక్టర్ రివ్యూ ద్వారా సమస్య పరిష్కారానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విల్లూరి రాము, కాండ్రేగుల విశ్వేశ్వర రావు, కాండ్రేగుల అప్పారావు కెప్టెన్, కాండ్రేగుల శ్రీనివాసరావు, కొణతాల పవన్, కర్రి గున్న, బుద్ధ లక్ష్మణరావు, కర్రి సన్యాశి అప్పారావు, కర్రి మోదినాయుడు, శిలపరశెట్టి జగన్నాధరావు పాల్గొన్నారు.

కూండ్రం హైస్కూల్లో మొక్కల నాటివేత

ప్రజాశక్తి-అనకాపల్లి : కీర్తిశేషులు గంటా పాల్గునరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు మండలంలో కూండ్రం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో 70 కొబ్బరి మొక్కలను శుక్రవారం ఎంపిపి గొర్లి సూరిబాబు చేతుల మీదుగా నాటారు. ఈ సందర్భంగా ఫాల్గునరావు కుటుంబ సభ్యులను గ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె ధర్మారావు, వైయస్సార్సీపి గ్రామ అధ్యక్షులు సేనాపతి పెంటారావు, గ్రామ సర్పంచ్ నందారపు లక్ష్మి, ఎంపీటీసీ సత్యవతి, ఎలమంచిలి చిన్న రమణ, ఎలమంచిలి సన్యాసినాయుడు, ఎలమంచిలి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న రాష్ట్ర స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌కు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - పరవాడ : అండర్ వాటర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగు 3వ నేషనల్ ఫిన్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు ఎంపిక చేయుటకు ఈనెల 23 ఆదివారం పరవాడ సంస్కృతి గ్లోబల్ స్కూల్లో పోటీలు, ఎంపిక నిర్వహిస్తున్నట్లు యుఎస్ఎఫ్ఎ రాష్ట్ర కార్యదర్శి పి.బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఉదయం 8 గంటలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి. సూర్యనారాయణ రెడ్డి ప్రారంభిస్తారని, ఆసక్తి గల స్విమ్మర్స్ 9550453755 నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. పోలింగ్ బూతుల అధికారులు తమ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ సర్వే చేపడుతున్నారు. ఓటర్ జాబితాలో తప్పు ఒప్పులను సరి చేయడంతో పాటు ఓటు హక్కు కోల్పోయిన వారు, చనిపోయిన వారి పేర్లను, ఇంకా వాటర్ జాబితాలో ఉన్న పొందకుండా ఉండిపోయిన వారి వివరాలను సైతం ఎన్నికల కమిషన్ ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. దేవరాపల్లి మండలంలోని 57 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వాటర్ జాబితా ఆధారంగా ఇంటింటి సర్వే జరుగుతున్నట్లు తహశీల్దారు ఎం లక్ష్మి తెలిపారు. తారువ గ్రామంలో జరుగుతున్న సర్వేను తహశీల్దారు శుక్రవారం తనిఖీ చేశారు.

25న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యారంగ సమస్యలు పరిష్కారానికై ఏఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, టిడీఎస్యు, ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్ఏ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు సిపిఐ కార్యాలయంలో బందు పోస్టర్లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు జి ఫణీంద్ర కుమార్, డి శివ, వియ్యపు రాజు, సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం యథావిధిగా కొనసాగించాలని, ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని కోరారు.

సిఎస్ఆర్ నిధులతో వ్యవసాయ కాలువల మరమ్మతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని వ్యవసాయ కాలువల మరమ్మతులను సిఎస్ఆర్ నిధులతో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ చిక్కాల రామారావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన నీటిని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ మాట్లాడుతూ నీటిపారుదల శాఖకు సంబంధించిన గ్రీవెన్స్ వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు పూర్వపు సమావేశంలో జరిగిన అంశాలపై తీసుకున్న చర్యలను తెలియజేశారు. ఉద్యాన శాఖ అధికారి ప్రభాకర్ రావు జీడిమామిడి, తమలపాకు వంటి పంటల బీమా కొరకు నివేదిక ఇచ్చామన్నారు. ఇండో ఫారం ట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులు రైతులు, గ్రూపు సభ్యులతో సమావేశమై సబ్సిడీపై ట్రాక్టర్లకు సర్వీసింగ్ చేపట్టినట్లు చెప్పారు. జిల్లా డ్రోన్లకు ప్రతి మండలంలో ఒక పైలెట్‌ను ఎంపిక చేయాలని చెప్పారు. విత్తనాలు ఎరువులు సకాలంలో రైతులకు సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తెలియజేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ సంపూర్ణ మిశ్రమ దాణా 60 శాతం సబ్సిడీపై పాడి రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. ఏడి మార్కెటింగ్ రవి కిరణ్ మాట్లాడుతూ ఎంపీ ఎఫ్సీల పురోగతిని తెలియజేశారు. ఇప్పటి వరకు 3 ఎంపీ ఎఫ్సీలు (మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్) పూర్తి అయినట్లు చెప్పారు. ఈ సమావేశంలో సెరికల్చర్ ఏడి వర్మ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు ఎస్.రమణ, జి.ఆనంద్ రావు, ఆర్. గంగు నాయుడు ఏ.పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానంతో లాభం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానంలో వ్యవసాయం చేయడం ద్వారా నాణ్యమైన పంటతో పాటు అధిక ఉత్పత్తి సాధ్యమని ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శిరసపల్లి అప్పలరాజు అన్నారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ పూడి పరదేశి నాయుడు ఆధ్వర్యంలో రైతులచే ద్రవ జీవామృతం ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఎంటీ మజ్జి సత్యారావు, ఐ సి ఆర్ పి ఎం మోహన్, రైతులు జల్లూరి అరుణ, ఎం ఉమా, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-బుచ్చయ్యపేట బస్సు ప్రారంభం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : విశాఖపట్నం నుండి బుచ్చయ్యపేట మండల కేంద్రం వరకు ఆర్టీసీ బస్సు 300బి సర్వీస్‌ను శుక్రవారం నుంచి ఏపీఎస్ఆర్టీసీ ప్రారంభించింది. ఈ సర్వీసు విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉదయం 6.10 గంటలకు బయలుదేరి బుచ్చయ్యపేట మండల కేంద్రానికి 8.20 గంటలకు చేరుతుందని, తిరిగి బుచ్చయ్యపేట నుంచి ఉదయం 8.35 గంటలకు బయలుదేరి విశాఖ కాంప్లెక్స్‌కు 10.45 గంటలకు చేరుతుందని మద్దిలపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. ఈ సర్వీస్‌ను ప్రయాణికుల కోరిక మేరకు నడిపిస్తున్నామన్నారు.

మూలపేటలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో శుక్రవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని సందర్శించిన సర్పంచ్ బీశెట్టి గంగ అప్పల నాయుడు సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలానుగుణంగా నేత్రాలకు సంబంధించిన వ్యాధులు ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. పిహెచ్సి వైద్యురాలు విమలగిరి వైద్య సేవలు అందించగా ఏఎన్ఎం రమణి, ఆశా కార్యకర్తలు, గృహ సారథులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'లో వాగ్వాదం

- కాలనీ ఇళ్లు కేటాయించకపోవడంపై అధికారులను నిలదీసిన ప్రజలు

ప్రజాశక్తి-కోటవురట్ల: ఎండపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కాలనీ ఇళ్ళ లబ్ధిదారులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సర్పంచ్ పావని అధ్యక్షతన మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జగనన్న కాలనీ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసినా స్థలం కేటాయించక పోవడంపై అధికారులను లబ్ధిదారులు నిలదీశారు. పోలీసులు కలగజేసుకుని సభ సజావుగా నడిపించేందుకు ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, ఉప సర్పంచ్ నాని పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో పాతమల్లంపేట, జోగుంపేట గ్రామాల్లో లబ్ధిదారులకు దృవ పత్రాలను అందజేశారు. పాతమల్లంపేటలో మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు నల్లబెల్లి శ్రీనివాసరావు, ఎంపిడిఓ డేవిడ్‌రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీను, పంచాయతీ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

జోగంపేట సచివాలయ పరిధిలో సాలికమల్లవరం, జోగుంపేటలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, జోగంపేట సర్పంచ్ జువ్వల లక్ష్మి, సాలికమల్లవరం సర్పంచ్ నవరత్నం, తహశీల్దార్ ఆనంద్, వైసిపి అధికార ప్రతినిధి అప్పలనాయుడు, ఉప సర్పంచ్ స్వామినాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తెలిపారు. రేబాక గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఉపమాకలో గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ అంబేద్కర్, ఈఓపిఆర్డీ వెంకట నారాయణ, సర్పంచ్ లు సాది రెడ్డి శ్రీనివాసరావు, అప్పలనరస, ఎంపీపీ రత్నం, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు పాల్గొన్నారు .

నక్కపల్లి : ఉపమాకలో సర్వే నెంబర్ 112లో 27 ఎకరాల గ్రామ కంఠం భూమి 22 ఎగా నమోదు కావడం తో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసారని దీంతో క్రయ విక్రయాలు జరపడానికి అవకాశం లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. 1920 నుండి 2018 వరకు రిజిస్ట్రేషన్లు యధావిధిగా జరిగేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సర్వే చేసి ఎస్ఎఫ్ ఏ ప్రకారం గ్రామకంఠం భూమిగా పరిగణించి ప్రజలకు క్రయవిక్రయాలు జరుపుకునే అవకాశం కల్పించి భూములు రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆలయ అసిస్టెంట్ గురవయ్య దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు కొల్లాటి పార్వతి, బుజ్జి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, ఎంపీపీ రత్నం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ ఉన్నారు.

కోటవురట్ల: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పందూరు సచివాలయ పరిధిలో అల్లుమియ్యపాలెం గిరిజనులకు కుల దృవీకరణ పత్రాలు తహసిల్దార్ జానకమ్మ అందజేశారు. ఈ సందర్భంగా జానకమ్మ మాట్లాడుతూ, గిరిజన గ్రామ వాసులకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కుల దృవీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. నేరుగా తహసిల్దార్ వచ్చి దృవపత్రాలు అందజేయడంతో గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సి హెచ్ కుమారి, వైసిపి నాయకులు రమణ, సోమేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారి ఆషారత్నం, గ్రామస్తులు నూకరాజు, రాంబాబు, రాజు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు ఇస్తున్న తహశీల్దార్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని తీర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఫిష్ ల్యాండింగ్, జెట్టి నిర్మాణానికి జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధికారులతో కలిసి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. మండలంలోని రాజయ్యపేట, బోయపాడు, దొండవాక తీర ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్, జెట్టి నిర్మాణానికి గాను గుర్తించిన స్థలాలను పరిశీలించారు. అనుకూలంగా ఉన్న స్థలాలపై అధికారులతో చర్చించారు. రాజయ్యపేట తీరంలో ఫిష్ లాండింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని మత్స్యకారులు గతంలో స్థానిక ఎమ్మెల్యే బాబురావుకు, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో పిచ్చి కుక్క దాడి చేయడంతో పలువురికి గాయాలు అయ్యాయి. గురువారం గ్రామంలో కుక్క ఇష్టానుసారంగా పలువురిని కరిచింది. ఈ దాడిలో కొర్ని రమణ, అయితం రెడ్డి రమణ, ఆదిలమ్మ,దొడ్డి లక్ష్మి,లక్ష్మీ రావు లతో పాటు మరో నలుగురిపై దాడి చేసి గాయపరిచింది. శుక్రవారం ఉదయం సైతం గాడి రాజు మరొక వ్యక్తిని కరచింది. గ్రామస్తులు పిచ్చి కుక్కను అంతం చేశారు. మరో కుక్క సైతం పిచ్చిగా ఉండటంతో గ్రామస్తులు భయ బ్రాంతులవుతున్నారు. బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

గాయపడిన బాధితుడు

ఎపిఆర్‌జెసికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-మాడుగుల: స్థానిక వీనస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. శుక్రవారం వెలువడిన ఏపిఆర్ జెసి ఫలితాలలో దంగేటి పల్లవి 931 ర్యాంక్ సాధించి విజయనగరం కళాశాలకు ఎంపిక కాగా, బర్ల జయదేవ్ 1083 ర్యాంకు సాధించి నాగార్జున సాగర్ కళాశాలకు ఎంపిక అయ్యాడు. కాగా జయదేవ్ ఇటీవల ట్రిపుల్ ఐటీ లోనూ ర్యాంకు సాధించాడు.ఈ విద్యార్థులు వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాలపు రెడ్డి నాగ చంద్ర వద్ద శిక్షణ పొందారు.

పల్లవి

జయదేవ్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

మెనూ అమల్లో నిర్లక్ష్యం

ప్రజాశక్తి- చీడికాడ: మండలంలో మంచాల మోడల్ స్కూల్లో హాస్టల్ వార్డెన్‌గా ఓ అమ్మాయిని స్కూలు ప్రిన్సిపాల్ డైరెక్ట్ గా నియమించడం, ఆమెకి విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి జీతం గా చెల్లించడం చట్ట విరుద్ధమని ఎస్ఎఫ్ఐ నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ రమణ విలేకరులతో మాట్లాడుతూ, మంచాల మోడల్ స్కూల్ వసతి గృహంలో సుమారు 100 మంది విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు సరిగా లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రమణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శ ఎస్వి నాయుడు పాల్గొన్నారు.

కిటికీని పరిశీలిస్తున్న టిడిపి నేత వెంకటేష్

పాఠశాల మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పెదబోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరమ్మతు పనులు చేయించాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్లాబ్ పెచ్చులు ఊడుపడు తున్నాయని, తలుపులు, కిటికీలు సక్రమంగా లేవన్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందుతున్నారన్నారు. ఇలాగే ఉంటే వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లలు ఎవ్వరూ జాయిన్ అయ్యే పరిస్థితి లేదన్నారు.నాడు నేడు ద్వారా ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గోనగాల రామకృష్ణ,బొందలపు లక్ష్మణరావు, ఈశ్వరరావు, గొర్ల శ్రీను,ఈగల మణి, ప్రసాదుల వెంకటరమణ,గొర్ల శ్రీను, అల్లు రమణ, వియ్యపు చంటి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ప్రారంభించారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి గుడి నుండి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, పదవులు ముఖ్యం కాదని, అభివృద్ధి ముఖ్యమని, ప్రజల పక్షాన ఏ నిర్ణయానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వర్తకులందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నష్టపోతున్న భవన యజమానులకు నష్ట పరిహారాన్ని చెల్లిస్తామని, మిగతా వారికి టిడిఆర్ బాండ్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జయరాం, కమిషనర్ కనకారావు, తహశీల్దార్ అన్నాజీ రావు, నర్సీపట్నం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నమ్మి గణేష్, నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ బోడ పాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

'పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం'

ప్రజాశక్తి-యస్.రాయవరం: పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఉపాధ్యక్షులు యేజర్ల వినోద్ రాజు విమర్శించారు. శుక్రవారం పెదగుమ్ములూరు లో తన స్వగృహంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్ళించి గ్రామాభివృద్ధికి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే దారి మళ్ళించిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా భావిస్తుందన్నారు. సర్పంచులు తమ అధికారాలను నిలుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ ఛాంబర్, రాష్ట్ర పంచాయతీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24 న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద వినతి పత్రాలను కలెక్టర్లకు అందుచేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు దాడి ఎరుక నాయుడు, శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వినోద్‌రాజు

అణుకు గిరిజనులపై నిర్లక్ష్యం తగదు

దీక్షలో కూర్చున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-కోటవురట్ల: అణుకు గిరిజనుల సమస్య లపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను తెలిపారు. రిలే నిరాహార దీక్ష శుక్రవారం 15వ రోజుకు చేరుకుంది. ఆయన దీక్ష శిబిరం వద్దకు చేరుకొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామానికి రహదారి, పాఠశాల వంటి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గిరిజనుల పట్ల చిన్నచూపు తగదని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, జిల్లా వాణిజ్య సభ్యులు ఎస్.బాబ్జి, జానకి హరి, కసిరెడ్డి ఏసు, పలివెల కోటి, గొట్టువాడ నాయకులు రాంబాబు, అప్పారావు, రమణ, చౌడువాడ శివ, పందూరు రమణ, రామచంద్రపురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అలాగే శిబిరాన్ని సందర్శించిన సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చి దీక్షలు ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు సత్యనారాయణ, నారాయణమూర్తి, నాగేశ్వరరావు, కొండబాబు, రాజబాబు, కేశవరావు, సిపిఎం మండల నాయకులు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని శనివారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటన నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం గవర్నమెంట్ టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్‌జెడి జ్యోతి కుమారి, డిఇఓ వెంకట లక్ష్మమ్మ స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. జెవికె కిట్లు, బుక్స్, ఇతర రికార్డులు పక్కాగా ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేష్ పాల్గొన్నారు..

ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి

ప్రజాశక్తి-యస్.రాయవరం:మూసి వేసిన ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి కార్మికులకు రూ. 6కోట్ల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని శుక్రవారం ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఫ్యాక్టరీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఫ్యాక్టరీ అకౌంటెంట్ ఆఫీసర్ మురళీకృష్ణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, దేశంలోనే మొట్టమొదటి కో ఆపరేటివ్‌లో ఏర్పడిన ఘణమైన చరిత్ర కలిగిన ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీని మూసివేయడం తగదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ మహాసంకల్ప పాదయాత్రలో భాగంగా 2018 ఏడాదిలో ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన సభలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ ని ఆధునీకరించి నడిపిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాలు గడుస్తున్నా ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోలేదని, పైగా ఫ్యాక్టరీని మూసి వేసి కార్మికులకు, రైతులకు తీవ్రంగా అన్యాయం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఏటికొప్పాక ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, ఏ నారాయణమూర్తి, కె.రమణ, గోవిందు, రమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.త్రినాధరావు, జీ దేవిడ్ రాజు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గాజువాక సమీక్షా సమావేశానికి పిలవరా..

- సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి-కలెక్టరేట్:గాజువాక నియోజకవర్గ అభివృద్ధిపై గురువారం జరిగిన సమీక్షా సమావేశానికి ప్రతిపక్ష కార్పొరేటర్లను ఆహ్వానించకపోవడాన్ని సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునకు వినతి పత్రం సమర్పించారు. గురువారం గాజువాక, విశాఖ ఉత్తర నియోజకవర్గాల అభివృద్ధిపై జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, వైవి.సుబ్బారెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎలు, ఆ నియోజకవర్గాల పరిధిలో ఉన్న వైసిపి కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు కాని వైసిపి నాయకులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించినట్లు పత్రికల్లో చూసి తాను ఆశ్చర్యానికి గురయ్యానని గంగారావు అన్నారు. ఆ సమావేశానికి గాజువాక నియోజకవర్గ పరిధిలోని 78వ వార్డు కార్పొరేటరుగా ఉన్న తనను ఆహ్వానించకపోవడం చట్టవ్యతిరేకం, వివక్షతతో కూడుకున్నదిగా భావిస్తున్నానన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలో కూడా ఇలా జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులు కాని వారిని, వైసిపి నాయకులుగా ఉన్నవారిని ఆహ్వానించి సమీక్ష చేయటం అధికారాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రతిపక్షపార్టీల కార్పొరేటర్లు లేకుండా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నియోజకవర్గ సమావేశాలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నారు. ప్రజా అధికారిగా కలెక్టర్ చట్టాలను, నిబంధనలను తప్పనిసరిగా అమలు జరపాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీనివాసరావును సన్మానిస్తున్న న్యాయవాదులు

చట్టాలపై అవగాహన పెరగాలి

- ప్రముఖ న్యాయవాది కావేటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ:ఇమ్మిగ్రేషన్ చట్టాలపై న్యాయవాదులకు అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ప్రముఖ అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. శుక్రవారం విశాఖపట్నం బార్ అసోసియేషన్, కావేటి లా ఫర్మ్ సంయుక్త ఆధ్వర్యంలో లైబ్రరీ హాల్‌లో 'ఇంటర్నేషనల్ లా' అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అమెరికాతో పాటు విదేశాల్లో ఉద్యోగాల పేరుతో బ్రోకర్లు తప్పుడు వెబ్‌సైట్లను సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటి వాటి పట్ల ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరముందని అన్నారు. ఇమ్మిగ్రేషన్‌లో ఇబ్బందులు పడకుండా తాము న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, కోశాధికారి భాస్కరరావు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

ప్రజాశక్తి-మాడుగుల:మణిపూర్ సంఘటన దోషులకు ఉరి శిక్ష విధించాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ ఎలుసూరి ఘాటీ లు డిమాండ్ చేశారు. ఒమ్మలిలో శుక్రవారం నిర్వహించిన విలేకరులతో మాట్లాడుతూ, మణిపూర్‌లో మహిళల పై జరిగిన సంఘటన సిగ్గు చేటన్నారు. సుప్రీం కోర్టు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక జారీ చేసిన విధానంతో న్యాయం ఇంకా వుందని అర్థం అవుతుందన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా కన్వీనర్ కొల్లి చిన సుబ్బారావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా యువసేన అధ్యక్షులు ఎలకా మల్లిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతలు

గడప గడపకూ సంక్షేమ పథకాలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న బూడి

ప్రజాశక్తి-చీడికాడ: గడప గడపకు సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలో అడవి అగ్రహారం గ్రామంలో శుక్రవారం గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించడమే తమ లక్ష్యమని, నాలుగేళ్లలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. స్థానికంగా సమస్యలను ప్రజలతోనే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ గొల్లవిల్లి రాజుబాబు, యూత్ కన్వీనర్ స్వామి నాయుడు, సర్పంచ్ సలాది దనలక్ష్మి, గంగశేషు, పంచాయతీ కార్యదర్శి గోపి, వైసిపి నాయకులు గంటా మత్సరాజు సన్యాసిరావు, పరువాలు రామారావు, మహేష్, ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి, హౌసింగ్ ఏఇ సూరిబాబు, విద్యుత్ ఏఇ వెంకట్రావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాయకరావుపేట: కందిపూడి గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గొల్ల బాబురావు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. కందిపూడి గ్రామంలో అతి త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చిక్కాల రామారావు, ప్రచార పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, జగత శ్రీను, పాయకరావుపేట పిఎసిఎస్ అధ్యక్షులు దేవవరపు రాజేష్ ఖన్నా, ఇసరపు తాతారావు పాల్గొన్నారు.

పనసలపాడులో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని పనసలపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 2, 3, 4, 6, 11 సాగులో లేనటువంటి జగనన్న రీసర్వే లో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకి ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కి స్పందనలో చేసిన ఫిర్యాదుపై శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు.అనంతరం ఆర్డీవో, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి దళితులు, గిరిజనులు సాగు భూములను కాలినడక వెళ్లి పరిశీలించారు. 50 సంవత్సరాల నుండి జీడిమామిడి, టేకు, సరుగుడు తోటలపై 50 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నామని, జగనన్న రీ సర్వేలో గత తహశీల్దార్ సాగులో ఉన్న వారిని లేనట్టుగా సాగులో లేని వారిని స్థానికేతరులకు పట్టాలు ఇచ్చారని ఆర్డీవో ముందు వాపోయారు. ఈ పట్టాలు వెంటనే రద్దు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్‌కి నివేదిక పంపిస్తామని ఆర్‌డిఒ చెప్పారు. రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కుమ్మక్కై ఆర్‌ఒఆర్ చట్టానికి వ్యతిరేకంగా పాల్పడిన రెవిన్యూ అధికారి పై చర్యలు తీసుకోవాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పాల్తేటి పెంటారావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవిలు డిమాండ్ చేశారు.

సాగు భూముల పరిశీలన

మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ఆర్‌టిసి డిపోలో తనిఖీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక ఆర్టీసి డిపోను జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నర్సీపట్నం మున్సిపాలిటీలోని రోడ్డు విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో నర్సీపట్నం బస్ స్టేషన్ కు సంబంధించి ఎన్ని షాపులు పూర్తిగా పోతున్నాయో పరిశీలించామన్నారు. దీనిపై నర్సీపట్నం డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్‌తో సమావేశం నిర్వహించామని ఆమె అన్నారు. డిపోలో ఇందుకు సబంధించి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఆర్‌టిసి అధికారులు, తదితరులు ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

నేడు వైసిపి సమావేశం

ప్రజాశక్తి -రావికమతం: మండల కేంద్రంలో ఈనెల 22న జరిగే వైసిపి సమావేశానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహా లక్ష్మి నాయుడు కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక లేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్ లో శనివారం జరిగే ఈ సమావేశానికి శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ హాజరు కానున్నారన్నారు.

ఫిర్యాదు చేస్తున్న జనసేన నేతలు

జనసేన నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి- మాడుగుల:జగనన్న ఇళ్ల నిర్మాణం లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని జనసేన నేతలు రెవెన్యూ కార్యాలయంలో అధికారుల ఫిర్యాదు చేశారు. మాడుగుల మండల కేంద్రంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి భార్యకు ఇంటి స్థలం ఎలా కేటాయించారని, దీనిపై అధికారులు దర్యాప్తు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు రొబ్బా మహేష్, మంచాల శివ, బిజెపి నేత మండల సతీష్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న తహసిల్దార్ అంబేద్కర్

ఓటరు సర్వే ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి:ఓటరు జాబితా ఇంటింటా సర్వే ఈనెల 21 నుండి ఆగస్టు 21 వరకు బూత్ లెవెల్ అధికారులు సర్వే నిర్వహిస్తారని తహసిల్దార్ అంబేద్కర్ తెలిపారు .మండలంలోని ఉపమాక లో శుక్రవారం బూత్ లెవెల్ అధికారులు నిర్వహించిన ఇంటింటా సర్వేను ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు హరిబాబు పాల్గొన్నారు.

హైకోర్టు ఆర్డర్ ప్రభుత్వానికి చెంపపెట్టు

ప్రజాశక్తి-అనకాపల్లి:చక్కెర కర్మాగారాల విషయంలో హైకోర్టు ఆర్డర్ జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ అన్నారు. సహకార చక్కెర కర్మాగారాల దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం వేసిన ప్రణాళికలను హైకోర్టు నిషేధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1964 సహకార చట్టం సెక్షన్ 64 (1)కు వ్యతిరేకంగా రైతుల ప్రమేయం లేకుండా రైతుల ఆస్తి దోపిడీకి చేసిన కుట్రను రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం గుర్తించి ప్రభుత్వానికి చెంప దెబ్బ కొట్టిందని పేర్కొన్నారు. పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఏమాత్రం మానాభిమానాలు ఉన్నా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి చక్కెర కర్మాగారం విషయంలో మంత్రి వైఖరి మొదటి నుండి అనుమానాస్పదంగానే ఉందని, ఫ్యాక్టరీని తన అనుచరగణానికి కట్టబెట్టే కుట్రను రైతులు వ్యతిరేకించినప్పటికీ మంత్రి అమర్నాథ్ నిస్సిగ్గుగా తెర వెనుక ఫ్యాక్టరీని కాజేసే కుట్రను వేగవంతం చేశారని ఆరోపించారు. బుద్ద కాశీ మాస్టర్, కొట్ని రామకృష్ణ, విల్లూరి రమణ బాబు, బుద్ద భువనేశ్వరరావు పాల్గొన్నారు.